# ఏఁబదివేల బేరము

## శ్రీయుత క. రామానుజరావుగారిచే వ్రాయఁబడినది.

### [1910 సాధారణ సంవత్సరాదిసంచికనుండి]

చెన్నపట్టణమందలి షాహుకారుపేట లక్ష్మికి నివాస స్థలము. సూర్యోదయము మొదలు రాత్రి పండ్రెండు గంటలవఱకును, ఆ వీధిలో నింటింట లక్ష్మి తాండవ మాడుచుండును. ఆ వీధిలో ధనవంతులగు కోమటుల యొక్కయు, వారికంటె ధనవంతులగు గుజరాతీలయొక్కయు, వారికంటె నెక్కుడు లక్ష్మీపుత్రులగు మార్వాడీలయొక్కయు నిండ్లుండుటచే వర్తకమునకు ఆవీధి పుట్టినిల్లనుటకు సందియము లేదు. రవలు కెంపులు మొదలైన విలువగల రాళ్లు మానికలతో గొలుచువట్టి వర్తకు లచ్చట నున్నారని చెప్పినచో నచ్చటి ప్రతియింటను రూపాయలు, కాసులు, సవరనులు మొదలైన వెండి బంగారు నాణెము లెల్లప్పుడును ఘల్లు ఘల్లు మనుచుండు నని వేరుగ జెప్పవలెనా?

ఒకనా డుదయమున నేడుగంటలవేళ జగజీవనలాల్ షాహుకారుయొక్క నాలుగంతస్థుల మేడయెదుట రెండు గుఱ్ఱముల కోచిబండి యొకటి వచ్చి నిలిచెను. ఆ బండిలో వెనుకప్రక్క నొక పురుషుఁడును, అతనిభార్యయు గూర్చుండియుండిరి. వారికి నెదుట నైదారు నెలల పిల్లవాని నెత్తుకొని యొకదాసి కూర్చుండియుండెను. బండికి వెనుక చిత్రమైన దుస్తులు ధరించిన గుఱ్ఱపువాండ్రిద్దరు నిలిచియుండిరి. బండికి ముందుభాగమున నెత్తుగనున్న యాసనముపై కోచిమన్ అనగా గుఱ్ఱములను తోలువాఁడును, వానిప్రక్కన మరియొక సేవకుఁడును గూర్చుండియుండిరి. బండి వచ్చి నిలిచినతోడనే వెనుకనున్న గుఱ్ఱపువాండ్రిద్దరును దిగి ముందుకు వచ్చి గుఱ్ఱపు కళ్లెములను పట్టుకొని నిలువబడిరి. ముందు నున్నతాసనముపై గూర్చున్న సేవకుఁడు దిగి యొద్దకు రాగానే యజమానుఁడు తన జేబులో నుండి తన పేరుగల విజిటింగ్‌కార్డు నొకదానినితీసి వానికిచ్చెను. వాఁడు ఆ యింటి గుమ్మములో కూర్చున్న సేవకుని చేతికిచ్చి నీ యజమానునకీ కార్డు చూపుమని వానిని లోనికిం బంపెను. జగజీవనలాల్ ఆ కార్డును చూచుకొని రాజా ఆఫ్ నర్సాపూర్ అని చదివి తత్తరపాటుతో లేచి బండి యొద్దకు వచ్చెను. ఈ వర్తకుఁడు గొప్ప రాళ్ల వర్తకుఁడని విఖ్యాతిఁజెందిన వాఁడు. రవ్వలు, కెంపులు, పచ్చలు, వైడూర్యములు మొదలైన విలువలేని మాణిక్యముల వర్తకమే ఎల్లప్పుడును చేయుచుండును. పుష్యరాగముల వంటి తక్కువ వెలగల రాళ్లనుగాని, వెండి బంగారములనుగాని ముట్టనే ముట్టఁడు. అతని పద్దులన్నియు వేలు లక్షలుగల సంఖ్యలతో నిండియుండును. గొప్ప గొప్ప రాజులు మహారాజులతనియొద్ద లక్షలకొలఁది వెలగల రాళ్లను నమ్మకగా తీసికొని పోవుచుండిరి. ఆ రాజులకు తగిన మర్యాదలుచేసి వారిని సంతోషపఱిచి, వారెక్కుడు రాళ్లను గొనునట్లు చేయు సామర్థ్యమీ ముసలిషాహుకారునకుం గలదు. అందుచేతనే ఒకానొక రాజు వచ్చెనని తెలిసినతోడనే మన షాహుకారు తత్తరపాటుతో లేచి ఎదురేగెను. అతఁడు బండి సమీపమునకు వచ్చినతోడనే, అచ్చట నిలుచున్న సేవకుఁడు బండి తలుపు దీసెను. బండిలోనుండి జమీందారుగారు దిగివచ్చి షాహుకారుతో షేక్ హాండుచేసి "మీరేనా జగజీవనలాలు షేట్జీగారు?" అని యడిగెను. అందు కతఁడు 'చిత్తమని' తలయూపఁగా "నేడు బహు సుదినము. ఎన్ని దినములనుండియో యనుకొనగా నేడు మీ దర్శనము లభించినది. కుబేరుని తరువాత తామే కుబేరులని వినియున్నాను."

"చిత్తము. మీవంటి రాజాధిరాజుల యనుగ్రహ ముండ నేను కుబేరుఁడనే. లోనికి దయచేయుఁడు" అని మాట్లాడుకొనుచు వారిద్దరును లోనికి పోయిరి. వారివెంటనే జమీందారుగారి భార్యయు, పిల్లను నెత్తుకొన్న దాసియు, షాహుకారు నింటిలోనికిఁ బ్రవేశించిరి. సాధారణముగా జమీందారుల భార్యలకు ఘోష యున్నప్పటికిని ఈ జమీందారుఁడు ఇంగ్లీషు ఫాషన్ గల వాఁడగుటచే తన భార్యకు ఘోష లేకుండ జేసినట్లు కానవచ్చుచున్నది. ఘోషమాత్రము లేదుకాని, ఆమెకు వంటిమీఁద నగలుమాత్ర మపరిమితముగా నుండెను. మెడలోనున్న సూర్యహారమే యొక పదివేలు చేయవచ్చును. చంద్రహారమే పదియైదువేలు చేయవచ్చును. కాళ్లకున్న బంగారపు పాంజేవులు అయిదువేలయిన కరీదు చేయవో? అట్లే దాసి బుజముపై నిద్రించుచున్న బాలునికిని మిక్కిలి విలువగల నగలు పెట్టఁబడెను.

వారందరును లోనికి వెళ్లిన తరువాత, ఆ షాహుకారు, మేడమీఁద గొప్ప గొప్ప రాజులకొఱకై వెలగల కుర్చీలతోను, సోఫాలతోను, పటములతోను, అలంకరింపఁబడిన హాలులోనికిఁ దీసికొనిపోయి జమీందారుగారి నొక కుర్చీమీఁదఁ గూర్చుండఁబెట్టి అతని భార్యకు కొంచెము చాటునున్న యొక స్థలమును కూర్చుండుటకు చూపించెను. తాను జమీందారుగారి నెదుటనున్న యొక కుర్చీమీఁదఁ గూర్చుండి యిట్లు సంభాషింపఁ దొడఁగెను.

జగ: -"అయ్యా, మీరు మా ఇంటికి వచ్చుట సుకలిత విశేషము. తమ రాజధాని ఏ జిల్లాలోదండి?"

జమీం:—"మా సంస్థానము గోదావరి జిల్లాలో నున్నది. మిక్కిలి గౌరవముగల సంస్థానము. ఇతర జమీందారులకులేని యనేక గౌరవములు మాకు కలవు. మేము కలెక్టరును చూచుటకు వెళ్లునపుడు పదిహేను ఫిరంగులు కాల్చెదరు. వెండి కుర్చీలమీఁదగాని మేము కూర్చుండము. కాని నే నింగ్లీషు ఎడ్యుకేటెడ్ జంటిల్‌మన్ అయినందున ఈ పిచ్చి ఆచారమును పాటింపను. టట్ నాన్సెన్సు అని మా ఆడవారి ఘోషకూడా తీసివేసితిని. అంతా నొక్కసారిగా తీసివేసిన బాగుండదని మావాండ్రు మగవారి నెదుటనే కూర్చుండక కొంచెము ప్రక్కగా కూర్చుండుదురు. సంస్థానమునకు పేష్కష్ పోగా మూడులక్షల ఆదా కలదు. ఈ సంగతుల కేమిగాని నిన్నటిదినము జయపురము మహారాజాగారు 'మీవద్దనుండి కొన్న లక్ష రూపాయల జవాహిరి చూచితిని. వారికి నాకు మిక్కిలి స్నేహము. బాల్యమునుండి ఒక ప్రక్కన పెరిగినట్లు పెరిగినాము."

జగ:—"చిత్తము మహారాజులంగారికి నాయందు మిక్కిలి అనుగ్రహము. ఈ సంవత్సరము వారు నావద్ద ఎంతలేదన్నా పది లక్షల జవాహిరీ కొన్నారు."

జమీం:—"రవ్వలంటే మీవద్దనే రవ్వలు, ఏమి ఆ కాంతి? ఇది వరకు రవ్వ లనేకము కొంటినిగాని ఇట్టి వన్నెఁడును చూడలేదు. ఇంకను మీవద్ద అట్టి రవ్వలు గలవా?"

జగ:—"ఎన్ని వలయునో కలవు. కొనువారుండిన రవలకేమితక్కువ. తెప్పించెదనా" అని యడిగి జమీందారుగారు తలయూపగానే లేచి లోనికిఁ

